క్లుప్తంగా...

22 నుంచి క్రికెట్ పోటీలు

కీసర: కీసరలోని ఎన్‌సీజీ క్రికెట్ గ్రౌండ్‌లో క్రికెట్ టోర్నమెంట్‌ను ఈ నెల 22వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు టోర్నమెంట్ నిర్వాహకుడు తటాకం భాను ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22వ తేదీ నుంచి 23వ తేదీ వరకు క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నట్లు, క్రికెట్ పోటీల్లో గెలుపొందిన వారికి ప్రథమ బహుమతిగా రూ.15 వేలు, ద్వితీయ బహుమతి కింద రూ.10 వేలను విజేతలకు అందజేస్తామన్నారు. ఆసక్తిగల క్రికెట్ అభిమానులు ఫోన్: 95531 49145, 96669 95557, 96660 13250.

అనురాగ్‌లో అంతర్జాతీయ కాన్ఫరెన్స్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉప కులపతి రామచంద్రం, నీలిమా తదితరులు

ఘట్‌కేసర్: వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీ(ఏయూ)లో ఇంటిలిజెంట్ కంప్యూటింగ్ ఫర్ సస్టెయినబుల్ (ఐసీఐసీఎస్‌డీ) అంతర్జాతీయ కాన్ఫరెన్స్ పోస్టర్‌ను యూనివర్సిటీ ఉప కులపతి రామచంద్రం, సీఈఓ నీలిమా ఆధ్వర్యంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్ప్రింగర్ పబ్లికేషన్స్ సహకారంతో 2023, 25–26 తేదీల్లో సదస్సు జరగనుందని, యూకే, ఇటలీ నుంచి ముఖ్య వక్తలు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో కాన్ఫరెన్స్ చైర్మన్ సతీశ్‌కుమరన్, ఈసీఈ, ఈఈఈ, విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

సబ్సిడీపై విత్తనాలు

కీసర: కీసర రైతు సహకార సంఘంలో 65శాతం సబ్సిడీపై జనుము, జిలుగ విత్తనాలను అందుబాటులో ఉంచడం జరిగిందని మండల వ్యవసాయాధికారి మాధవిలత తెలిపారు. రైతులు 40 కిలోల జనుము బస్తాకు రూ.1,225, 30కిలోల జిలుగ బస్తాకు రూ.840 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు పట్టాదారు పాసుపుస్తకాలు, ఆధార్ కార్డు జిరాక్స్, కాపీతో కీసర రైతు వేదికలో సంప్రదించాలని కోరారు.

సీఎం కేసీఆర్ ఫ్లెక్సీకి వీఆర్‌ఏల పాలాభిషేకం



ఘట్‌కేసర్: వీఆర్‌ఏల ఉద్యోగాలను క్రమబద్ధీకరిస్తామన్న ప్రభుత్వ నిర్ణయానికి హర్షం వ్యక్తం చేస్తూ మండలంలోని వీఆర్‌ఏలు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం సీఎం కేసీఆర్ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వీఆర్‌ఏల సంఘం మండల అధ్యక్షుడు కృష్ణ మాట్లాడుతూ పేస్కేల్, వారసత్వ ఉద్యోగాల కల్పన, పదోన్నతులు తదితర సమస్యలు పరిష్కారించడంతో వేలాది కుటుంబాలకు మేలు జరుగుతుందన్నారు. ఏళ్లుగా అర్ధాకలితో అలమటిస్తున్నామని, పదోన్నతుల అనంతరం రెవెన్యూ శాఖలోనే కొనసాగించాలని కోరారు. కుమార్, లక్ష్మయ్య, రాజు, ప్రభాకర్, కృష్ణ, మైసయ్య, భిక్షపతి, సత్యనారాయణ, విజయలక్ష్మీ, వంశీ, కలీం పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ మద్దుల లక్ష్మీ

శామీర్‌పేట్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 3, 9, 10 వార్డుల్లో శుక్రవారం చైర్‌పర్సన్ మద్దుల లక్ష్మీ పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. రూ.40 లక్షలతో మున్సిపాలిటీ పరిధిలోని కేవీ రెడ్డి నగర్, కండ్లకోయ ప్రాంతాల్లో సీసీ రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ప్రభాకర్, కౌన్సిలర్లు పెంటయ్యముదిరాజ్, కమిషనర్ రాములు, మున్సిపల్ డిప్యూటీ ఈఈ దుర్గ ప్రసాద్, కౌన్సిలర్లు వీణ, హంసరాణి, కో ఆప్షన్ సభ్యుడు దేవేందర్, వర్క్ ఇన్స్‌పెక్టర్లు అరుణ్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

అదృశ్యమైన విద్యార్థి ఆచూకీ లభ్యం

శామీర్‌పేట్: పదో తరగతి పరీక్షల్లో ఫెయిల్ అయ్యాడని మనస్తాపంతో ఇంట్లో నుంచి వెళ్లిపోయిన విద్యార్థి ఆచూకీ లభ్యమైంది. మేడ్చల్ సీఐ వీరశేఖర్‌రెడ్డి వివరాల ప్రకారం.. మేడ్చల్ మున్సిపాలిటీ పరిధి ఎస్‌జీఓఎస్ కాలనీలో నివాసముండే జమ్ముల రాజవర్ధన్(17), గురువారం రాత్రి 7 గంటలకు ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. బంధువులు, స్నేహితుల ఇళ్లతో పాటు పలు ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభ్యంకాకపోవడంతో కుటుంబ సభ్యులు శుక్రవారం ఉదయం మేడ్చల్ పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు విద్యార్థి ఆచూకీ కనుగొని తల్లిదండ్రులకు అప్పగించారు.

గ్రామ పంచాయతీల్లో టీఎస్- బీపాస్

భవన, ఇతర నిర్మాణాల అనుమతులన్నీ టీఎస్–బీపాస్‌తోనే..

- అక్రమ నిర్మాణాలు.. లేఅవుట్ల అడ్డుకట్టతో జీపీలకు పెరగనున్న ఆదాయం
- జీపీల్లో బ్యాంకు ఖాతాలు తెరిచిన పంచాయతీ శాఖ
- ఇప్పటి వరకు పురపాలక సంఘాల్లోనే టీఎస్– బీపాస్
- పంచాయతీల్లో గ్రామకంఠం, ప్రభుత్వం, అసైన్డ్, ప్రైవేట్ భూముల గుర్తింపు



సాక్షి, మేడ్చల్ జిల్లా: గ్రామ పంచాయతీల్లో టీఎస్–బీ పాస్ అమల్లోకి వచ్చింది. ఇప్పటి వరకు భవన, ఇతర నిర్మాణాల అనుమతులు పురపాలక సంఘాలకు(నగరాలు, పట్టణాలు) మాత్రమే పరిమితమైన టీఎస్– బీపాస్ విధానం ఇప్పటి నుంచి గ్రామ పంచాయతీల్లోనూ అమలుకానుంది. పల్లెల్లో లేఅవుట్ల అనుమతులు, భవన నిర్మాణాల అనుమతులన్నీ ఈ విధానం ద్వారానే అమలు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు ప్రభుత్వం జీఓ 135 విడుదల చేసింది. దీని కోసం పంచాయతీల్లో నూతన బ్యాంకు ఖాతాలను కూడా తెరిచారు. నూతన పురపాలక చట్టం ద్వారా ప్రభుత్వం ఈ విధానం అమలు చేసేలా సమగ్ర కార్యాచరణ అమలు చేస్తోంది. జిల్లాలో పంచాయతీల వారీగా ఇప్పటికే గ్రామకంఠం భూముల సర్వే నిర్వహించారు. మరోవైపు ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుని ఎలాంటి యాజమాన్య హక్కులు లేని వాటిని క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం జీవో 58, 59 జారీ చేసిన విషయం తెల్సిందే. 2020 జూన్ 2కు ముందు ఇళ్లు నిర్మించుకున్న వారి నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. జిల్లాలో జీఓ 59కు సంబంధించిన దరఖాస్తులు 33,258 ఉండగా, ఇందులో గ్రామ పంచాయతీలకు సంబంధించిన దరఖాస్తులు 15 వేలకు పైగా ఉన్నాయి. మరోవైపు గ్రామకంఠం వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదించేందుకు అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు.

భూచిక్కులకు తెర..!

జిల్లాలో గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న ఇళ్లు, ఆవాసాలు, రెవెన్యూ రికార్డుల ప్రకారం మొత్తం విస్తీర్ణం, గ్రామ కంఠం భూమిలో ఉన్న ఇళ్లు, పట్టా లేకుండా ప్రభుత్వం ఆధీనంలో ఉన్న భూముల వివరాలు సేకరించారు. పంచాయతీలకు ఉన్న అవసరాలను కూడా నమోదు చేసినట్లు తెలుస్తోంది. రహదారులు, వాటర్ ట్యాంకులు, వాటి విస్తీర్ణం, పాఠశాలలు, పల్లెప్రకృతి వనాలు, క్రీడా ప్రాంగణాలు ఉపయోగించిన తర్వాత ఖాళీగా మిగిలి ఉన్న ప్రభుత్వ స్థలం వివరాలను ఈ జాబితాలో పొందుపర్చారు. గ్రామకంఠం భూములపై సమగ్ర అధ్యయనం చేసి వాటికి యజమానులకు హక్కులు కల్పిస్తామని పంచాయతీరాజ్ శాఖ స్పష్టం చేస్తోంది. ప్రభుత్వ భూములను గుర్తించి వాటికి రక్షణ కల్పించేలా చర్యలు తీసుకుంటారు. గ్రామకంఠం భూములకు రిజిస్ట్రేషన్లు అయ్యేలా చేయడంతో పాటు క్రయ విక్రయాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పర్యవేక్షించనుండటంతో భూసంబంధమైన చిక్కులు సమసిపోగలవని భావిస్తున్నారు.

జీపీల్లో నూతన బ్యాంకు ఖాతాలు

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో మొత్తం 61 పంచాయతీలు ఉన్నాయి. టీఎస్– బీపాస్ విధానం ద్వారా లేఅవుట్, భవన నిర్మాణ అనుమతుల రుసుం పెంచిన పంచాయతీ రాజ్ శాఖ కొత్త బ్యాంకు ఖాతాలను తెరిచారు. భవన నిర్మాణ అనుమతులకు మండలాన్ని యూనిట్‌గా తీసుకుంటారు. మండలాల పరిధిలో స్థలాల పరిశీలనను రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, డిప్యూటీ తహసీల్దార్, పంచాయతీరాజ్ ఏఈఈలు క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తారు. 10 ఎకరాల్లోపు లేఅవుట్ దరఖాస్తులను పరిశీలించేందుకు జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీర్, సాంకేతిక, టైటిల్ వెరిఫికేషన్లకు జిల్లా పట్టణ, నగరప్రణాళిక శాఖ అధికారులకు బాధ్యతలు అప్పగించనున్నట్లు తెలుస్తోంది. 10 ఎకరాలకు మించిన భూములుంటే పట్టణ, నగర ప్రణాళిక డైరెక్టర్ అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది.

జీపీల్లో టీఎస్-బీపాస్ ద్వారానే అనుమతులు

గ్రామ పంచాయతీల్లో టీఎస్–బీపాస్ విధానం అమల్లోకి వచ్చింది. ప్రతీ గ్రామపంచాయతీలో నూతన బ్యాంకు ఖాతాలు కూడా తెరిచారు. ఇకపై గ్రామ పంచాయతీల్లో లేఅవుట్లు, భవన నిర్మాణాలు, లేఅవుట్ల అనుమతులన్నీ టీఎస్–బీపాస్ విధానం ద్వారానే పొందాల్సి ఉంటుంది.

\- రమణమూర్తి, డీపీఓ, మేడ్చల్-మల్కాజిగిరి

27 వరకు ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్



మున్సిపల్ కమిషనర్ స్వామి, వైస్ చైర్మన్ మాదిరెడ్డి నరేందర్‌రెడ్డి తదితరులు

కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలో మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణకు చర్యలు చేపట్టడం జరుగుతోందని మున్సిపల్ కమిషనర్ స్వామి, వైస్ చైర్మన్ మాదిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పారిశుద్ధ్య ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ పరిధిలోని 10, 16వ వార్డుల్లో నిర్వహించిన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 27వ తేదీ వరకు ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అందులో భాగంగా వివిధ వార్డుల్లో చెత్తాచెదారం తొలగిస్తున్నట్లు వివరించారు. అనంతరం మున్సిపల్ పరిధిలోని 7వ వార్డులోని ఖుషీ గార్డెన్‌లో చిల్డ్రన్ పార్కును ప్రారంభించారు. కార్యక్రమంలో ముప్ప శ్రీలతరామరావు, మాదిరెడ్డి పావని రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుండ్లపోచంపల్లిలో పారిశుద్ధ్య పనులు

శామీర్‌పేట్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో శుక్రవారం ప్రత్యేక పారిశుద్ధ్య పనులను చైర్‌పర్సన్ మద్దుల లక్ష్మీ ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రత్యేక పారిశుద్ధ్య పనులను చేపట్టామని, చెత్త రహిత మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు ప్రజలు, సిబ్బంది సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ ప్రభాకర్, కమిషనర్ రాములు, పలువురు కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.



15 రోజుల పాటు ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రాలు



సమావేశంలో మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి, కమిషనర్ వాణీరెడ్డి తదితరులు

కీసర: మేరా లైఫ్–మేరా స్వచ్ఛ్ షెహర్‌లో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల్లో ఏర్పాటు చేయనున్న ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రాల్లో పొడిచెత్తకు సంబంధించిన అన్ని రకాల ప్లాస్టిక్ వస్తువులు, వినియోగంలో లేని దుస్తులు, షాంపూ కవర్లు తదితర వస్తువులను ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రాల్లో అందజేయాలని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, కమిషనర్ వాణీరెడ్డి మున్సిపల్ పరిధిలో నివసించే ప్రజలకు సూచించారు. ఈ మేరకు శుక్రవారం వార్డు అధికారులు, ఆర్‌పీలు, శానిటరి సూపర్‌వైజర్లకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతివార్డులో రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్‌కి సంబంధించిన కార్యక్రమం ఈ నెల 20 నుంచి వచ్చే 5వ తేదీ వరకు వార్డులవారిగా ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. 15 రోజుల పాటు ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రాల్లో వినియోగంలో లేని వస్తువులు, పనికిరాని పొడి వస్తువులు అందజేసి మున్సిపల్ సిబ్బందికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో మేనేజర్ చంద్రశేఖర్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ రాంరెడ్డి, ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ ప్రశాంత్ మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు చేయూత అందించాలి



ట్యాబ్ అందజేస్తున్న ఎమ్మెల్యే ఈటల రాజేందర్

మల్కాజిగిరి: ప్రభుత్వాలు విద్యార్థులకు అన్ని వసతులు కల్పించలేవని, వారికి అండగా నిలవాల్సిన అవసరం ఉందని బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. శిక్షా పాత్ర టీమ్‌సాయి పేరుతో చదువులో ఉత్తమ ప్రతిభ కనబర్చిన పేద విద్యార్థులు 325 మందికి టాబ్స్, డిజిటల్ వాటర్ బాటిల్స్ అందజేశారు. మల్కాజిగిరి పద్మావతి ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమానికి హాజరైన ఈటల రాజేందర్ మాట్లాడుతూ ప్రస్తుత విద్యా పరిస్థితుల్లో ఆన్‌లైన్ ద్వారా పాఠాలు వినే రోజులు వచ్చాయని, టాబ్స్, మొబైల్స్ లేక పేద విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారన్నారు. పేదవిద్యార్థులకు అండగా నిలబడేందుకు ముందుండాలన్నారు. ట్రస్ట్ నిర్వాహకుడు టీంసాయి మాట్లాడుతూ శిక్షా పాత్ర పేరిట కార్యక్రమాన్ని తొలిసారిగా ప్రారంభించి మల్కాజిగిరి, కంటోన్మెంట్ ప్రాంతాల్లోని విద్యార్థులకు అందజేశామని తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, ఆర్మీ అధికారులు మేజర్ సుబేదార్ పీఎస్ఎస్ స్వామి, డి.కె.సింగ్, ఇతర ప్రముఖులు నిర్మల, వనితారేఖ, రవీంద్రనాథ్ ఠాగూర్, కార్పొరేటర్లు రాజ్యలక్ష్మి, సునీతాయాదవ్, నాయకులు హరీష్ రెడ్డి, వి.కె.మహేష్, బాలచందర్‌గౌడ్, శివకుమార్, సదానంద్‌గౌడ్, రవియాదవ్ పాల్గొన్నారు.



క్విజ్ పోటీలు ప్రారంభం

శామీర్‌పేట్/మేడ్చల్: రాజీవ్‌గాంధీ యూత్ క్విజ్ పోటీలను శుక్రవారం మేడ్చల్ ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జి అక్షయ్ లక్ర, యూత్ ప్రెసిడెంట్ బల్మూరి వెంకట్ పాల్గొని పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ సృజన్, జిల్లా కార్యదర్శి ఆనంద్, పలువురు యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఆకస్మిక తనిఖీ



శామీర్‌పేట్: మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డులో నూతనంగా ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని శుక్రవారం మేడ్చల్ జిల్లా వైద్య–ఆరోగ్యశాఖ అధికారి పుట్ల శ్రీనివాస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్యాంపు నిర్వహణ రికార్డులు, స్టాక్ రిజిస్టార్‌ను పరిశీలిచారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి



శామీర్‌పేట్/మేడ్చల్: కంటి వెలుగు కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కౌన్సిలర్ అర్చన కోరారు. మేడ్చల్ మున్సిపాలిటీ 17వ వార్డులో శుక్రవారం కంటివెలుగు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు శేఖర్‌గౌడ్, వార్డు అధ్యక్షుడు మహేష్ యాదవ్ పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

జైలుకెళ్లినా మారని దొంగబుద్ధి

కుషాయిగూడ: పలు దొంగతనాల కేసులో జైలుకెళ్లి వచ్చినా దొంగ బుద్ధి మారలేదు. జల్సాల కోసం ఇళ్ల ముందు పార్కు చేసిన బైక్‌లను చోరీ చేస్తూ దర్జాగా తిరుగుతూ పోలీసులకు పట్టుబడ్డ ఘటన శుక్రవారం కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. అతడి వద్ద నుంచి రెండు బైక్‌లు స్వాధీనం చేసుకొని రిమాండ్ తరలించారు. కుషాయిగూడ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్ వివరాల మేరకు.. కామారెడ్డి బాన్సువాడకు చెందిన మొట్టూరి ప్రమోద్ అలియాస్ ప్రమోద్‌రెడ్డిని తల్లిదండ్రులు నిర్లక్ష్యం చేయడంతో వ్యసనాలకు అలవాటుపడ్డాడు. తల్లిదండ్రులకు దూరంగ బోడుప్పల్ బొల్లిగూడలో నివాసం ఉంటూ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. జల్సాలకు డబ్బులు సరిపోకపోవడంతో చోరీలు చేస్తున్నాడు. ఇళ్ల ముందు పార్కు చేసిన బైక్‌లను రాత్రివేళ చోరీ చేస్తున్నాడు. బైక్‌లను ఇంట్లో ఉంచి స్పేర్స్ అమ్ముకుంటున్నాడు. ఈ క్రమంలో పోలీసులకు పట్టుబడి జైలు శిక్ష అనుభవించి వచ్చినా తీరు మార్చుకోలేదు. ఈ క్రమంలో శుక్రవారం నేతాజీనగర్ చౌరస్తాలో అదుపులోకి తీసుకున్నారు. జనగాం, ఘట్‌కేసర్, ఎల్‌బీనగర్‌లో ఒక్కో కేసు ఉండగా కుషాయిగూడ పోలీస్‌స్టేషన్‌లో రెండు కేసులు నమోదైనట్లు పోలీసులు వెల్లడించారు. ఆ యన వెంట ఎస్‌ఐ మదన్‌లాల్, సిబ్బంది ఉన్నారు.

ఇంటి స్థలాలను క్రమబద్ధీకరించాలని వినతి



మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న చైర్ పర్సన్ పావనీయాదవ్

ఘట్‌కేసర్: ప్రభుత్వ ఉత్తర్వు 59 ప్రకారం పట్టణంలోని ఈడబ్ల్యూఎస్ కాలనీలోని ఇంటి స్థలాలను క్రమబద్ధీకరించి పట్టాలు అందజేయాలని చైర్‌పర్సన్ పావనీయాదవ్ ఆధ్వర్యంలో మంత్రి మల్లారెడ్డి, టీఆర్‌ఎస్ మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మర్రి రాజశేఖర్‌రెడ్డికి శుక్రవారం వినతి పత్రం అందజేశారు. 1976–77లో నిర్మించుకున్న ఇళ్లను మున్సిపాలిటీలో క్రమబద్ధీకరించడానికి ప్రభుత్వ జారీ చేసిన ఉత్తర్వు 59 ప్రకారం రిజిస్ట్రేషన్ చేసి పట్టాలు అందజేయాలని లేఖలో పేర్కొన్నారు. అలాగే పేరు మార్పిడికి అవకాశం కలిపించాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి సానుకూలంగా స్పందించినట్లు, కలెక్టర్‌తో మట్లాడుతానని హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మాధవరెడ్డి, కౌన్సిలర్ మల్లేశ్, జంగయ్యయాదవ్, మాజీ వార్డు సభ్యుడు దేవేందర్‌ముదిరాజ్, ఈడబ్ల్యూఎస్ కాలనీ అధ్యక్షుడు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి శశిధరన్, నాయకులు సురేశ్‌యాదవ్, నాగరాజుగౌడ్, నరేశ్‌గౌడ్, నగేశ్, నజీర్, మున్నా పాల్గొన్నారు.

ధాన్యం వెనక్కి పంపడంపై అన్నదాతల నిరసన



గాంధీ విగ్రహం ఎదుట నిరసన చేపట్టిన అవుషాపూర్ అన్నదాతలు

ఘట్‌కేసర్: రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేసి.. తిరిగి వెనక్కి పంపడంపై అవుషాపూర్ గ్రామానికి చెందిన అన్నదాతలు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆవరణలోని గాంధీ విగ్రహం ఎదుట శుక్రవారం నిరసన చేపట్టారు. రైతులు పండించిన ధాన్యం కొనుగోలు చేసిన అనంతరం మిల్లర్ యజమానులు, అధికారులు కుమ్మక్కై ధాన్యాన్ని వెనక్కి పంపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్షం కారణంగా నష్టపోయిన దిగుబడికి పంట నష్టం చెల్లించకుండా కొనుగోళ్లపై తిరకాసులు పెట్టడం రైతులను మోసం చేయడమేనని అన్నారు. కనీసం పంటలకు పెట్టిన పెట్టుబడి కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిరసన కార్యక్రమంలో ఉప సర్పంచ్ నరేశ్, అన్నదాతలు మల్లేశ్, మధుసూదన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, సాయిలు, వీరబాబు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నేతలు



బీజేపీలో చేరుతున్న బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నేతలు

కీసర: కేంద్రంలోని నరేంద్రమోదీ నాయకత్వంలో దేశంలో అమలవుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను చూసి వివిధ పార్టీలకు చెందిన నేతలు పెద్ద ఎత్తున బీజేపీలోకి చేరుతున్నట్లు రాష్ట్ర బీజేపీ చేరికల కమిటీ చైర్మన్, హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. శుక్రవారం కీసర మండల బీజేపీ అధ్యక్షుడు దేశం మల్లేష్‌గౌడ్ ఆధ్వర్యంలో మేడ్చల్ జిల్లా రూరల్ బీజేపీ అధ్యక్షుడు పటోళ్ల విక్రంరెడ్డి సారథ్యంలో కరీంగూడ గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నేతలు ఎమ్మెల్యే ఈటల రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి జిల్లాల తిరుమల్‌రెడ్డి, భోగారం ఎంపీటీసీ సభ్యుడు సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి, బీజేపీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కొలిచెలిమి కృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి కోల బాలరాజ్‌యాదవ్, సతీష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

కీసరలో ప్రజాధనం దుర్వినియోగంపై చర్యలు తీసుకోండి

జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్‌ను కలిసిన బీజేపీ నేత విక్రంరెడ్డి



సాక్షి, మేడ్చల్ జిల్లా: కీసర గ్రామ పంచాయతీలో ప్రజాధనం దుర్వినియోగంపై చట్టపరమైన చర్యలు తీసుకొని ప్రజలకు న్యాయం చేయాలని బీజేపీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు పటోళ్ల విక్రంరెడ్డి కోరారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. కలెక్టర్ కలిసిన వారిలో జిల్లా ప్రధాన కార్యదర్శి జిల్లాల తిరుమల్ రెడ్డి, ఎంపీటీసీ సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు కొలిచేలిమి కృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి కొల బాలరాజ్‌యాదవ్, ఉపాధ్యక్షుడు నల్ల వెంకట్‌రెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు బండారు శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

సుంకం చెల్లించని మద్యం స్వాధీనం


మద్యం విలువ సుమారు రూ.3.50 లక్షలు



అబ్కారీ పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

పోచారం: ఎక్సైజ్ సుంకం చెల్లించని మద్యం బాటిళ్లను ఘట్‌కేసర్ అబ్కారీ స్టేషన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నారపల్లిలోని ఎక్సైజ్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా అబ్కారీ అధికారి డి.అరుణ్ కుమార్ వెల్లడించిన వివరాల ప్రకారం.. విశ్వసనీయ సమాచారం మేరకు ఏఎస్‌రావ్‌నగర్‌లోని సెయింట్ జాన్ బాప్టిస్ట్ చర్చ్ సమీపంలో శుక్రవారం పోలీసులు తనిఖీలు చేపట్టారు. మారుతి ఆల్టో కారులో వరంగల్ జిల్లా వెల్దండకు చెందిన జంగా లక్ష్మారెడ్డి(43) నాన్ డ్యూటీ పెయిడ్ జానీవాకర్, రెడ్‌లేబుల్ లిక్కర్ బాటిళ్లు తీసుకెళ్తుండగా తనిఖీల్లో పోలీసులకు చిక్కాడు. అతన్ని అదుపులోకి తీసుకుని విచారించగా కారులో ఉన్న 45 మద్యం బాటిళ్లతో పాటు అల్వాల్‌లోని మారుతినగర్ ఇంటిలో మరో 85 బాటిళ్లు ఉన్నాయని తెలిపాడు. హర్యానా నుంచి దిగుమతి చేసుకున్న ఈ మద్యం బాటిళ్లను తాటి శ్రీకాంత్, నాగరాజు వద్ద కొనుగోలు చేసినట్లు చెప్పాడు. పోలీసులు లక్ష్మారెడ్డిపై కేసు నమోదు చేసి కోర్టు ద్వారా రిమాండ్ చేశారు. తాటి శ్రీకాంత్, నాగరాజు పరారీలో ఉన్నారు. సుమారు రూ.3.50 లక్షల విలువ చేసే 130 మద్యం బాటిళ్లు, మారుతి ఆల్టో కారు, ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. తనిఖీలు ఎక్సైజ్ స్టేషన్ ఇన్స్‌పెక్టర్ ఎం.మల్లయ్య, ఎస్‌ఐలు పురుషోత్తంరెడ్డి, ఆకుల శ్రావణి, ఇతర సిబ్బంది ఆధ్వర్యంలో కొనసాగాయి.

ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని ఎంపీపీ చాంబర్‌లో ధాన్యం కొనుగోళ్లపై ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. నెల రోజులుగా కల్లాల్లోనే ధాన్యం ఉందని, తేమ శాతం పేరుతో అన్నదాతలను ఆగం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ కొనుగోలు చేసిన అనంతరం ధాన్యం బియ్యం మిల్లులోకి చేరుకున్నా నమ్మకం లేకుండా పోతోందని, ధాన్యం సరిగా లేదని వెనక్కి పంపుతున్నారన్నారు. అకాల వర్షాలతో ఈ సంవత్సరం కేవలం 10–20 శాతం దిగుబడి వచ్చిందని, వచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా ఇబ్బందులు పెడుతున్నారని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు సురేశ్‌రెడ్డి, జగదీశ్, ఉప సర్పంచ్ నరేశ్, రైతులు రాజశేఖర్‌రెడ్డి, మల్లేశ్ పాల్గొన్నారు.